# చిలక మీగా అదృష్టం చెప్పను

ఆ రోజు సాయంత్రం ఏదో పనివుండి హైదరాబాదు బస్‌డిపో వద్ద నే దిగాను. బస్ డిపోలో పని ఓ అయిదు నిముషాలలోనే ముగిసింది. తర్వాత నయాపూల్ దగ్గర ఒకరిని కలుసుకోవాలి. అది కూడా త్వరగా ముగించి అక్కడే నెంబరు వన్ బస్ ఎక్కి రెండో ఆట సినిమాకెళ్ళాలని కోరిక. ఎటు తిరిగి మొదటాట అందనే అందదు.

అప్పటికి ఆరు దాటింది.

నేను చకచకా నడవడం మొదలు పెట్టాను.

మూసీనది మీదుగా చల్లని గాలి తిరిగింది.

దూరంగా కొత్త సాలార్ జంగ్ మ్యూజియం ప్రాంతంనుండి ఏవో బాజా మోతలు....

సెంట్రల్ లైబ్రరీ పైనుండి కొన్ని వందల పావురాలు లేచి గిరికీలు కొడుతున్నాయి ..

శరీరానికి మళ్ళీ బాగా చల్లని గాలి తగిలింది.

మనస్సెందుకో హుషారుగా వుంది!

అప్పుడే ఓ ఫర్లాంగు నడిచాను.

సహజంగానే జనసమ్మర్దమూ, ట్రాఫిక్ రద్దీ ఈ ప్రాంతంలో తక్కువగా ఉండటంచేత నేను కూడా కొంచెం అశ్రద్ధగా పరధ్యానంగా నడుస్తున్నాను....

"బాబు, ఇటు ఇటు" పెద్దగా కేక విన్పడింది.

"మిమ్మల్నే - ఇటు రండి" ఉలిక్కిపడి తిరిగి చూచాను.

నన్నే !!

అరే! నిజంగా నన్నే పిలుస్తున్నాడాయన !!

యాంత్రికంగా అక్కడికి వెళ్ళాను.

ఆయన నావైపు నిశితంగా చూస్తున్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యమూ, కొంచెం ఉత్సుకతా కలిగాయి- ఎందుకని ఆయన నన్నే అలా చూస్తున్నాడు?

నాలో ఏదో ప్రత్యేకత అతనికి కన్పడిందా?

అయితే ఏమిటది?

మానవ సహజమైన దౌర్బల్యం నాలోనూ ఆవరించింది. ప్రతి మానవుడూ తానేదో విశిష్ట వ్యక్తినని భావిస్తాడు తానేదో అపురూపమైన సృష్టిగా తలుస్తాడు. తన్నుగూర్చి ఇతరులేమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటాడు.

అయినా ఈ దోవన ఒకరో అరో నాలాగే వెళ్తూనే వున్నారుకదా... త్రోవ అసలు నిర్మానుష్యం కాదుకదా, అలాంటప్పుడు అతడు నన్నే ప్రత్యేకంగా పిలవడంలో ఉన్న కారణం ఏమిటి?

నేనెందువల్ల అతని దృష్టి నాకర్షించాను?

అతనివేపు చూచాను.

అతడు నావైపు నిశితంగా చూస్తున్నాడు.

ఆ చూపు వెనుక కొంత ఆప్యాయత కూడా వుంది.

మనిషి మాంత్రికునివలె ఓ పెద్ద కుంకుమబొట్టు పెట్టాడు. ఓ పెద్ద తలపాగా- మాసినబట్టలు- నేలపై ఓ పట్టా పరిచాడు. దానిమీద రెండు పాత పుస్తకాలు పెట్టాడు. ఆ పుస్తకాల పక్కన్నే ఓ చిన్న కొయ్య పంజరం- అందులో ఓ రామచిలక- పంజరానికి ఇవతల వరుసగా కొన్ని మడిచిన కార్డులు పేర్చబడి వున్నాయి....

"క్యాబాబూ, నయాపూల్ జారహేఁ-"

ఔనన్నట్లు తల వూపాను.

అ తర్వాత ఉర్దూలో ఏదో ప్రశ్నించాడు. నాకర్థంకాదని చెయ్యి ఊపాను.

"తెలుగు తెలుస్తుందా?"

"అఁ-"

నవ్వాడు!

మీసాలు సవరించుకొని "మీకొక ముఖ్యమైన విషయం చెప్పాలి. ఓ అయిదు నిమిషాలు ఇటురండి"

"నాతోనేనా?"

"ఆ మీకేచెప్పాలి- రండి."

అని నావైపు ఆప్యాయంగా చూచాడు. నేనూ ఆశగా అతడు నాతో ఏమి చెప్పబోతాడోనని మరికొంచెం దగ్గరికిపోయి వంగాను.

"బాబూ? మీ పేరు రాతో ప్రారంభమవుతుంది."

'ఔను నిజమే'నన్నాను- నాపేరు రాఘవేంద్రరావు.

"మీ రాకరితో మాట్లాడే పనిమీద నయాపూల్ పోతున్నారు."

'నిజమే'నని తల వూపాను.

"మీకు త్వరలో ధనలాభం వుంది, బహుశా రేపు ఫస్టుకే"

ఈ దెబ్బతో నేను చిత్తయిపోయాను. ఈ వ్యక్తి సామాన్యుడు కాడు. నాకు రేపు ఫస్టుకే ఎరియర్స్ వస్తాయి. దానితోపాటు కొత్త జి.వో. ప్రకారం మరికొన్ని పైసలు కూడా ఎక్కువ ముట్టుతాయి- ఎలా తెలిసిందితనికీభవిష్యత్తు?

ఓహో! రోడ్డుపక్క ఇంత సామాన్యంగా ఎంతటి మహాసిద్ధుడున్నాడు!
అందుకే అన్నారు మట్టిలో మాణిక్యాలుంటాయని.
ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికెరుక!

ఉప్పు కప్పరమూ ఒకే పోలికలో వుంటుంది....కాని రుచులజాడ మాత్రం వేరు - అందుకనే వేమన్న అన్నాడు పురుషులందు పుణ్యపురుషులు వేరని.

ఎవరైనా, ఇంతటి భవిష్యత్తు దర్శించిన వ్యక్తి ఇలా రోడ్డుపక్క పడి వున్నాడంటే నమ్ముతారా ?

దానితో వెనుకా ముందూ చూడకుండా సామాజికమైన సిగ్గూ లజ్జా వదలి పెట్టి నిర్భయంగా అలాగే రోడ్డు పక్కన అతని ముందు కూలబడ్డాను.

ఆ మాంత్రికుడు సంతృప్తికి సూచనగా ఒక దరహాసాన్ని విసిరాడు.

చల్లని వాన గాలి మామీది నుండి పరుగెత్తుకు పోయింది.

"బాబూ - మీ భవిష్యత్తులో కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకో వలసినవి ఉన్నాయి - తెలుసుకుంటే మంచిది"

"తప్పకుండా - అలాగే చెప్పండి." నా భవిష్యత్తు తెలుసుకోవాలని నా కెంతో కోరిక - అందుకే పువ్వు మీ అదృష్టం చెప్పునని వున్న పత్రికా ప్రకటన చూచి రెండు సార్లు డబ్బు పంపాను. జలంధర్ సిటీ మాంత్రిక ఉంగరము - వశీకరణ శక్తి కలది తెప్పించాను - భవిష్యత్తు ఎలా వుంటుందో తెలుసుకోవాలనే కోరికతో ఓ కొండ రాజుకు ఓనాడు రెండు చొక్కాలిచ్చి చేయి చూపించుకున్నాను... ఖర్మకాలి, వాడు పోయిం తర్వాత తెలిసింది, వాడికిచ్చిన ఓ చొక్కా జేబులోనే డబ్బు పెట్టానని .. తర్వాత ఏమనుకొని ఏం లాభం ??

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే భవిష్యద్దర్శనంపై నాకు మక్కువ ఉన్నదని మీకు తెలిపేందుకే. ఆ మాటకొస్తే భవిష్యత్తు తెలుసుకోవాలనే కోరిక ఎవడికుండదీ లోకంలో ?? ఢిల్లీ వంటి చోట్లలో అయితే చాలా పెద్ద పెద్ద వారికి స్వంత జ్యోతిష్కులే వుంటారట !! ఆ పెద్దవాళ్ళు వాళ్ళను నెల జీతాలిచ్చి పోషిస్తారట !!

"బాబూ,"

మాంత్రికుని పిలుపు నన్ను ఆలోచనావాహిని నుండి ఇవతలికితీసుకు వచ్చింది.

"మీ భవిష్యత్తు నేను చెప్పను. ఈ చిలకే చెపుతుంది."

ఓహో ! పరమాద్భుతం ! చిలుక కంతటి మహత్తర శక్తి వుందా ? ఈయనే ననుకుంటే ఈయనకన్నా గొప్పదిలాగుంది ఈయన చిలక....

చూస్తూండగానే ఆయన కొయ్యపంజరం కటకటాలు తెరిచాడు....చిలక బయటకు వచ్చింది. కొంచెం బలహీనంగా వున్న తన రెక్కలూ తోకా కొద్దిగా కదిలించింది ...ముక్కుతో ఆ కార్డులలో ఓ మడత కార్డును ఇవతలికి లాగింది. అంతే ! ఆయన దాని ముక్కుకొక ధాన్యం గింజ ఏదో అందించాడు - వెంటనే దాన్ని పంజరంలోకి నెట్టి కటకటాలు మూశాడు.

నేను వింతపడి అలాగే చూస్తున్నానీ తమాషా అంతా - "బాబూ దానిపై ఓ అర్ధరూపాయి పెట్టండి." మాట్లాడకుండా జేబులోనుండి ఓ అర్ధరూపాయి బిళ్ళ తీసి ఆ కార్డుపై పెట్టాను. ఆ పెద్దమనిషి ఆ అర్ధరూపాయి బిళ్ళను తీసుకొని దానితో మూడుసార్లు కార్డును కొట్టి పక్కన పెట్టి కార్డు విప్పాడు . నా భవిష్యత్తు మొత్తమూ ఆ కార్డులో వుందన్నమాట - ఆత్రంగా నోరు తెరుచుకొని చూస్తున్నాను. మాంత్రికుడు మరోసారి మీసాలు దువ్వుకొని చిరునవ్వుతో ఆ

మడత విప్పి చదివాడు - అందులో నా భవిష్యత్తు అచ్చొత్తబడి వుంది, "బ్రహ్మ నీ నుదుట వ్రాసిన వ్రాతలో మార్పు వస్తుందేమో కాని చిలక జాతకం మటుకు మారేటట్టులేదు." అన్నట్లు మాంత్రికుడు నావైపు చూచాడు. జాతకం చదివి వినిపించాకమటుకు నాకంతగా సంతృప్తి కలుగలేదు. కొన్ని సుఖాలు రానున్నాయనీ కొన్ని కష్టాలు కలుగనున్నాయనీ, ఉత్తర దిశగా ప్రయాణమనీ, జరిగిన వాటిని మనసులో పెట్టుకోవద్దనీ అందులో ఉంది. ఇందులో వున్న ప్రతి అక్షరమూ నాకు వర్తించిన మాట నిజమే! కాని ఈ భూలోకంలో ఎవడికి మాత్రం ఇది వర్తించదు? ఎవడికి కొన్ని కష్టాలూ కొన్ని సుఖాలూ లేవు?? ఎవరైనా సరే గతాన్ని మరచిపోవడంకన్నా చేసేదేముంది?? అసలు భవిష్యత్తుపై ఆశతోనే కదా అంత ఉత్సాహంగా చిలక ప్రశ్నల వానిముందు కూర్చున్నాను- కాబట్టి ఈ జాతకం తప్పని చెప్పే సాహసం నాలో లేకపోయినా మనస్సును పూర్తిగా ఇది సంతృప్తి పరచలేదనే చెప్పవచ్చు....

చల్లగాలితోపాటు రెండు మూడు చినుకులు టపటప రాలాయి- నేను లేచి నిలబడి గుడ్డల కంటుకున్న దుమ్ము దులుపుకున్నాను. అసలు పని కాకుండా మధ్యలో కొంత కాలయాపన జరిగిందే అనిపించింది. చూస్తుండగానే ఒక్కసారి ముంచుకొచ్చినట్లు వర్షం ప్రారంభమైంది. నాలుగంగలలో నెంబరు వన్ బస్ స్టాప్ చేరాను. ఓ ఖాళీ బస్ నిలబడి వుంది. వెనుకా ముందూ చూడకుండా ముందు ఎక్కి కూర్చున్నాను. అందులో డ్రైవరూ లేడు కండక్టరూ లేడు!!

వర్షం బాగా తీవ్రతరమైంది. ఇంతలో వెనుదిరిగి చూద్దును చిలక ప్రశ్నల పెద్దమనిషి తన పట్టా, పంజరంతో బస్సులోకెక్కుతున్నాడు. కార్డులూ, పట్టాలు సర్దుకోవడంలో కొంత ఆలస్యమైందేమో, మనిషి కొంచెం తడిశాడు. న్రమంగా వచ్చి మరో ఖాళీ సీట్లో కూర్చున్నాడు. నేనాయనవైపు చూచి ఓ చిరునవ్వు నవ్వి ముభావంగా కూర్చున్నాను. అతడూ మెదలకుండా కూర్చున్నాడు. ఇద్దరం మాట్లాడుకోకపోవడానికి ప్రత్యేకమైన కారణం- ఇదీ- అదీ- అని చెప్పగలిగిందేమీ లేకపోయినప్పటికీ, మాట్లాడుకోవలసిన అవసరం కూడా కన్పించలేదు.

వర్షం అంతకంతకూ పెరుగుతున్నదే కాని తరగడంలేదు. విండో గ్లాసులు దింపి గువ్వలా ముడిచిపెట్టుకొని కూర్చున్నాను. బయలుదేరిన వేళ మంచిదికాదు. లేకుంటే పని కాకపోగా ఈ బస్సులో చిక్కుపడి పోయాను.వర్షం ప్రారంభమైతే సరి ఎక్కడి సిటీబస్సు లక్కడ నిలిచిపోతాయి ఈ నగరంలో.

త్రాచుపాముల్లాగా సాగుతున్న వర్షధారలు చూస్తుండగానేకొండచిలువల్లాగా మారాయి తారురోడ్లమీద. బస్సులోకి కూడా ఎలాగో కొంత నీటి చెమ్మ వచ్చింది. నీరు కారే గాజు తలుపులగుండా దూరాన మసక మసకగా కన్పడు తున్న ఇరానీ హోటల్ లైట్లు... ఏమీ తోచక అటూ ఇటూ చూచాను. నాలాగే చిలక ప్రశ్నల మనిషి ముడుచుకొని కూర్చున్నాడు. ఆయనవైపు చూచి భారంగా ఓ నవ్వు నవ్వాను. ఆయనా గజగజ వణుకుతూ నవ్వాడు. అయనకు సమీపంగా కొంచెం సీటు చివరకు జరిగి అడిగాను.

"ఈ రూటేనా"

"అఁ...."

"ఎక్కడ దిగుతారు?"

"పద్మారావు నగర్‌లో"

"వానకు లేచి వచ్చేసినట్టున్నారు?" తెలిసీ అడిగిన ప్రశ్న.

"ఔనౌను". ప్రశ్నకు తగ్గ జవాబు.

"పద్మారావు నగర్‌నుండి నయాపూల్ దాకా వచ్చారేం."

జవాబుగా ఓ చిన్న చిరునవ్వు విసిరాడు చిలక ప్రశ్నల మనిషి. బహుశా నా ప్రశ్నకు చిరునవ్వే సమాధానం కాబోలు. పద్మారావు నగర్‌లో గిరాకీ లేదేమో. లేక కాంపిటీషన్ వుందేమో. నయాపూల్‌వద్ద స్థలమాహాత్మ్యం వల్ల బాగా ప్రశ్నలు వస్తాయేమో. ఏ కారణమైనా కావచ్చు. అది అంత త్వరగా చెప్పదగినది కాదని అతని ఉద్దేశంలా వున్నది. చిరునవ్వుతోనే సంతృప్తి పడ మన్నాడు నన్ను.

"తమరు?" నన్ను ప్రశ్నించాడు మాంత్రికుడు.

"చిక్కడపల్లి దాకా" చెప్పాను.

"ఏం చేస్తుంటారు బాబూ?"

చెప్పాను.

"ఆఫీసు?"

నా చేతిసంచీ వైపు చూస్తూ ప్రశ్నించాడు. దానిమీద నా పేరూ డిజిగ్నే షన్‌వున్న కార్డు అమర్చాను.

'లకడీకాపూల్ లేదూ, అక్కడ'

'శానాదూరం'

'ఔను. అయినా ఉద్యోగధర్మం! మీరు రాలేదూ చిలకప్రశ్నలు చెప్పేం దుకు పద్మారావు నగర్‌నుండి అఫ్‌జల్‌గంజ్‌కి.'

ఇది ప్రశంసో విమర్శో తెలియక కొంచెం తికమకపడ్డాడు పెద్దమనిషి. నేనే అన్నాను,

'త్వరగా వెళ్ళాల్సిన పని వుంది. ఇలా వాన వస్తుందని ఊహించలేదు. అనవసరంగా చిక్కుబడిపోయాను.' మాంత్రికుడు నా వైపు సానుభూతిగా చూచాడు. ఆ చూపుల్లో తన పరిస్థితీ అలాగే వుందనే భావం స్ఫురించింది.

ఇంతలో నాకు మెరుపులా ఓ ఆలోచన వచ్చింది.

"అయ్యా! చిలకతో ప్రశ్న చెప్పించండి వర్షం వెంటనే వెలిసి బస్సు బయలుదేరుతుందా? లేక ఇంకా ఎక్కువవుతుందా?" అని ఆయన వైపు చూచాను

మాంత్రికుని ముఖంలో రంగులు మారాయి డబ్బుకోసం అలా ఆలో చిస్తున్నాడేమోనని "అర్ధరూపాయి దక్షిణ నేను ఇచ్చుకుంటాను - మొగమాట పడకండి" అన్నాను మళ్ళీ జేబులో చెయ్యి పెట్టి!

దానితో మాంత్రికునికి కోపం వచ్చింది.

"మీరెంత ఆఫీసరయితే మాత్రం నా విద్యను అవమానించడం మీకు ధర్మం కాదు. నా చిలక ఇలాంటి చిల్లర విషయాలు చెప్పదు. నా భవిష్యత్తు, తన భవిష్యత్తూ కూడా చెప్పుకోదు. నా చిలక నా అదృష్టం ప్రశ్న చెపితే నేను రోడ్డుపక్క ఎందుకు కూర్చుంటానూ?" అంటూ చిటపట చినుకులలోనే బస్సు దిగి వెళ్ళిపోయాడు రుసరుసలాడుతూ!

ఇప్పుడు నిర్ఘాంతపోయి చూడటం నావంతు అయింది!!